సాక్షి ఒడిశా

శనివారం । 4 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,99,378
బంగారం	300 మిల్లీ గ్రాములు
వెండి	53 గ్రాముల 700 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ఘోరం..!

అడవి పందులను వేటాడే క్రమంలో విద్యుత్ తీగలను అమర్చడంతో, ఆ విద్యుత్ తీగలకు ఒక యువకుడు బలయ్యాడు.

- 10లో



మహిళా రిపోర్టర్‌పై నిర్మాత దాడి

మీడియా కవరేజీలో హడావుడిగా ఉన్న మహిళా రిపోర్టరును ఓలీవుడ్ నిర్మాత చెంప దెబ్బ కొట్టడం సంచలనం రేపింది.

- 10లో

న్యూస్‌రీల్

తహసీల్దార్‌గా అనురాధ



బాధ్యతలు స్వీకరించిన అనురాధ

రాయగడ: జిల్లాలోనిమునిగుడ తహసీల్దార్‌గా ఎం.అనురాధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన అనామిక పాండేకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో అనురాధ బాధ్యతలు చేపట్టారు. కొందమాల్ తహసీల్దార్‌గా ఇదివరకు అనురాధ విధులను నిర్వహిస్తుండేవారు. ఆమెకు ఈ సందర్భంగా మునిగుడ బీడీవో ప్రీతమ్ తంటి అభినందించి స్వాగతం పలికారు.

విజిలెన్స్ వలలో జూనియర్ ఇంజినీర్



జూనియర్ ఇంజినీర్ సాగరిక మహంతి

బరంపురం: విజిలెన్స్ వలకు మరో అవినీతి చేప చిక్కింది. గంజాం జిల్లా బుగడా బ్లాక్‌కి చెందిన జూనియర్ ఇంజినీర్ సాగరిక మహంతి పింఛన్ విడుదల చేసేందుకు రూ.5 వేలు లంచం తీసుకుంటూ విజిలెన్స్ అధికారులకు చిక్కారు. ఈ సందర్భంగా బరంపురం విజిలెన్స్ ఎస్పీ మాయాధర్ స్వాంయి తెలిపిన వివరాల మేరకు.. బుగడా బ్లాక్‌కి చెందిన మహిళా జూనియర్ ఇంజినీర్ సాగరిక మహంతి పంజి వీధికి చెందిన గుప్తేశ్వర్ ముఖికి పింఛన్ మంజూరు చేసేందుకు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు గుప్తేశ్వర్ ముఖి బరంపురం విజిలన్స్ అధికారులను ఆశ్రయించారు. దీంతో గురువారం బరంపురం విజిలెన్స్ అధికారులు బుగడా బ్లాక్ కార్యాలయంలో పథకం ప్రకారం లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. అన్ని ఆధారాలు సేకరించి ఆమెను కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు.


ద్విచక్ర వాహనం తగలబెట్టిన దుండగులు



దగ్ధమైన ద్విచక్ర వాహనం

రాయగడ: స్థానిక చెక్కాగుడ ప్రాంతంలో నివిసిస్తున్న ఇప్పిలి రమేష్ అనే వ్యక్తి ఇంటి బయట ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి తగలబెట్టారు. ఇంటి బయట దట్టమైన పొగ రావడంతో నిద్రలేచిన రమేష్‌కు బయట తన ద్విచక్ర వాహనం(స్కూటీ) దగ్ధమవుతుండడం కనిపించింది. దీంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు బాధితుడు సదరు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు చెక్కాగుడ ప్రాంతంలోని సీసీ కెమేరాలను పరిశీలించారు. అర్ధరాత్రి 2.30 ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు బాధితుని ఇంటి వైపు తిరుగుతున్నట్లు గమనించిన పోలీసులు వారి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. బాధితుడు రమేష్ ఒక వెబ్ ఛానెల్‌లో విలేకరిగా విధులు నిర్వహిస్తున్నాడు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



ఎల్లో బ్రిడ్జి ప్రాంతంలో పడి ఉన్న సోమనాథ్ సేన్ మృతదేహం

జయపురం: జిల్లాలోని పబ్లిక్ హెల్త్ విభాగంలో పనిచేస్తున్న సోమనాథ్ సేన్(54) అనే వ్యక్తి స్థానిక ఎల్లో బ్రిడ్జి సమీపంలో అనుమానాస్పదంగా మరణించారు. గురువారం ఇంటి నుంచి వెళ్లిన అతను మరలా ఇంటికి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలియజేశారు. శుక్రవారం ఉదయం అతడి మృతదేహం ఉన్న విషయం తెలియడంతో పోలీసు వర్గాలు వెళ్లాయి. సోమనాథ్ సేన్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపామని, అనంతరం అతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వెల్లడించారు. అయితే సోమనాథ్‌ది సహజ మరణమా లేక హత్య అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తర్వాత అతని మరణానికి గల కారణం తెలియవచ్చు.



వేట నిషేధంతో గోపాల్‌పూర్ సముద్రపు ఒడ్డున నిలిచిన పడవలు

- నవంబర్ 1 నుంచి చేపల వేట నిషేధం
- తీరానికి ఆలివ్ రిడ్లేల ఆగమనంతో నిర్ణయం
- ఆర్థిక ఇబ్బందులపై మత్స్యకారుల ఆవేదన

బతుకు నావ భారంగా..!

బరంపురం: సుదీర్ఘ తీరప్రాంతం గంజాం జిల్లా సొంతం. సూన్‌పూర్ నుంచి రామలింగం (ప్రయాగా) వరకు సుమారు 53 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. ఈ పరిధిలో సుమారు 108 మత్స్యకార గ్రామాలు ఉన్నాయి. 12 వేల కుటుంబాలు చేపల వేట ప్రధాన ఆధారంగా జీవిస్తున్నాయి. అయితే ప్రస్తుతం గంజాం జిల్లా రుశికుల్యా నది కలిసే బంగాళాఖాతం సముద్ర తీర ప్రాంతానికి గుడ్లు పెట్టేందుకు ఆలీవ్ రిడ్లే తాబేళ్ల రాకతో, సముద్రంలో నవంబర్ 1వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు చేపల వేట నిషేధించడంతో మత్స్యకార కుటుంబాలకు పస్తులు తప్పేలా లేవు. అలల సంద్రంపై ఆధారపడి బతుకునీడుస్తున్న గంగపుత్రుల జీవనాన్ని ఓసారి పరిశీలిస్తే...

ఆర్థికంగా ఇబ్బందులు

గంజాం జిల్లాలో ఇటు సూన్‌పూర్ నుంచి అటు కేశ్‌పూర్ వరకు సుమారు 53 కిలోమీటర్లు విస్తరించి ఉన్న తీర ప్రాంతంలో, సుమారు 108 మత్స్యకార గ్రామాల్లో అనేకమంది చేపల వేటే ప్రధాన ఆధారంగా జీవిస్తున్నారు. నిరంతరం ప్రకృతి వైపరీత్యాల ఆటుపోట్ల మధ్య జీవనం సాగిస్తున్నారు. మత్స్యకారులకు అరుదైన తాబేళ్లు గంజాం జిల్లా తీర ప్రాంతానికి రావడం ఒకవైపు ఆనందంగా ఉన్నా, మరోవైపు ఒక పెద్ద శాపంగా మారింది. రుశికుల్యా నది కలిసే బంగాళాఖాతం సముద్ర తీర ప్రాంతానికి ఆలీవ్ రిడ్లే తాబేళ్ల రాకతో ప్రతీఏటా నవంబర్ నుంచి మే 31 వరకు సముద్రంలో చేపల వేట నిషేధిస్తున్నారు. దీంతో మత్స్యకార కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

అక్కరకు రాని పథకాలు

మత్స్యకారుల జీవల ప్రమాణాలు మెరుగుపడేందుకు ప్రభుత్వం భారీగా పథకాలు ప్రవేశపెట్టినా వారిచెంతకు చేరడం లేదు. వేట నిషేధ సమయంలో ఒక్కో కుటుంబానికి రూ.15,000 ప్రభుత్వం అందిస్తున్నా నిబంధనల పుణ్యమా అవి వారికి సక్రమంగా చేరడం లేదని మత్స్యకార సంఘాల ప్రతినిధుల నుంచి తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నాటు పడవలతో వేట

జిల్లా సముద్ర తీర ప్రాంతానికి ఆలీవ్ రీడ్లే తాబేళ్లు గుడ్లు పేట్టేందుకు రాకతో మత్స్యకారుల ఇంజిన్ బోట్లు నిషేధిస్తూ 5 కిలోమీటర్ల లోపే చేపల వేట సాగించాలని ప్రభుత్వం విధించిన నిబంధన ప్రకారం నాటు పడవల వేటతో మత్స్యకారుల నష్టపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి తోడుగా ఆంధ్ర ట్రాలీలు వచ్చి మత్స్య సంపదని దోచుకొని తరలించుకుపోతుంటే నిషేధంతో సంప్రదాయ పద్ధతిలో నాటు పడవలతో పోటీ పడలేక డీలా పడిపోతున్నారు. దీంతో వేటలో తినడానికే తప్ప అమ్ముకోవడానికి కావాల్సిన చేపలు దక్కడం లేదని జిల్లా మత్స్యకారులు ఆవేదన తెలియజేస్తున్నారు.



వలలు బాగుచేసుకుంటున్న మత్స్యకారులు



తీరంలో సేద తీరుతున్న మత్స్యకారులు

ప్రభుత్వం ఆదుకోవాలి

మత్స్యకారుల్లో 40 శాతం మందికే గుర్తింపు కార్డులు ఉండగా, మరో 60 శాతం మందికి గుర్తింపు కార్డులు లేవు. గుర్తింపు ఉన్న 40 శాతం మందికి ప్రభుత్వం తరపున కేవలం నెలకి 5 కిలోల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వీటి అన్నింటినీ పరిగణలోకి తీసుకొని మిగిలిన 60 శాతం మత్స్యకారులకు గుర్తింపు కార్డులు అందించాలని కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు. నెలకి 50 కిలోల బియ్యం మరియు రేషన్ అందజేయాలంటున్నారు. 50 సంవత్సరాలు దాటిన వారికి ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. ఉచితంగా ఆరోగ్య సేవలు అందించాలని మరియు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలు అందే విధంగా సబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

నిషేధిత ప్రాంతంలో చేపల వేట



పహరా బృందం అదుపులో ట్రాలరు

- అదుపులో 15 మంది

భువనేశ్వర్: పూరీ జిల్లా అస్తరంగ్ సమీపంలో నిషేధిత ప్రాంతంలో చేపలు వేటాడుతున్న బృందాన్ని పహరా వర్గాలు అదుపులోకి తీసుకున్నాయి. ఈ చర్యలో చేపల వేటకు వినియోగించిన ఒక ఫిషింగ్ ట్రాలర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఉన్న 15 మంది మత్స్యకారులను అటవీ శాఖ పెట్రోలింగ్ బృందం అదుపులోకి తీసుకుంది. సంతానోత్పత్తికి సమూహంగా తరలి వస్తున్న ఆలివ్ రిడ్లేలకు పూర్తి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఆంక్షలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ ఆంక్షల ఉల్లంఘనకు పాల్పడిన వారికి వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపడతామని ముందస్తుగా హెచ్చరించారు. మూడు నదీ సముద్ర సంగమ తీర ప్రాంతాల నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో మోటారు, యాంత్రిక పడవలతో చేపల వేట నిషేధించారు. ఈ ఆంక్షలు నవంబర్ 1 నుంచి వచ్చే ఏడాది మే నెల 31 వరకు ఏడు నెలల పాటు నిరవధికంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ నిషేధం ఆంక్షల ఉల్లంఘించిన నేరం కింద ఫిషింగ్ ట్రాలర్ 'సతీ మంగళ'ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ట్రాలర్‌ను నువాగాంప్ జెట్టీకి తరలించి మెరైన్ ఫిషరీస్ శాఖకు అప్పగించారు. అటవీ శాఖ పహరా బృందంలో ఫారెస్టర్లు బిరజా మహాపాత్రో మరియు తపన్ నాయక్, ఫారెస్ట్ గార్డ్ అబినాష్ ఖుంటియా మరియు నిర్మల్ ప్రధాన్, ఇండియన్ కోస్ట్ గార్డ్ సిబ్బంది ఉన్నారు. రాష్ట్రంలోని దేవి, ధామ్రా మరియు రుషికుల్య మూడు నదీ ముఖద్వారాల సమీపంలోని ఆలివ్ రిడ్లే గూడు ప్రదేశాలపై చేపల వేటపై నిషేధం విధించిన విషయం తెలిసిందే.

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్

- సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు

భువనేశ్వర్: ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ పేరును సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. జస్టిస్ సింగ్ ప్రస్తుతం పాట్నా హైకోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో ఈ విషయం ప్రసారం అయింది. హైకోర్టు న్యాయమూర్తిగా 11 సంవత్సరాలకు పైగా పనిచేసిన సమయంలో, జస్టిస్ సింగ్ 1,246 నివేదించబడిన తీర్పులను రచించారని, వాటిలో 562 గత 5 సంవత్సరాల్లో తీర్మానించినవిగా పేర్కొన్నారు. ప్రస్తుతం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల్లో పాట్నాలోని హైకోర్టుకు ప్రాతినిధ్యం లేదన్న వాస్తవాన్ని కూడా కొలీజియం పరిగణనలోకి తీసుకుంది. కొలీజియం తదనుగుణంగా, జస్టిస్ సింగ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నియామకానికి సరిపోతారని గుర్తించి సిఫారసు చేయాలని నిర్ణయించింది.

వివరాలు పరిశీలిస్తే...

జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్ ఢిల్లీ యూనివర్సిటీ (క్యాంపస్ లా సెంటర్) నుంచి న్యాయశాస్త్రంలో పట్టభద్రులై 1990 సంవత్సరంలో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అతను సెప్టెంబర్ 2010లో సీనియర్ అడ్వకేట్‌గా నియమించబడ్డారు. ఆ సంవత్సరం డిసెంబర్‌లో బీహార్‌కు అదనపు అడ్వకేట్ జనరల్‌గా నియమితులయ్యారు. 2012 సంవత్సరం ఏప్రిల్ 5న పాట్నా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పాట్నా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఒరిస్సా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి బిద్యుత్ రంజన్ షడంగి స్థానంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఒరిస్సా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుభాసిస్ తలపాత్ర పదవీ విరమణ చేసిన తర్వాత అక్టోబర్ 4 నుంచి అమలులోకి వచ్చేలా, హైకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ బిద్యుత్ రంజన్ షడంగిని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా నియమించారు. జస్టిస్ తలపాత్ర 33వ ప్రధాన న్యాయమూర్తిగా ఈ ఏడాది ఆగస్టు 8న ప్రమాణ స్వీకారం చేశారు. రెండు నెలల కంటే తక్కువ కాలం ఆయన ఈ హోదాలో బాధ్యతలు నిర్వహించి అక్టోబర్ నెల 3న పదవీ విరమణ పొందారు.



జస్టిస్ చక్రధారి శరణ్ సింగ్

82 కిలోల గంజాయి పట్టివేత



అరెస్టైన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: దిగపండి నుంచి బరంపురం వైపు వస్తున్న ఒక కారులో అక్రమంగా గంజాయి రవాణా అవుతున్నట్లు ముందుగా సమాచారం అందుకున్న బరంపురం ఎక్సైజ్ అధికారులు హింజికాట్-దిగపండి మరియు బరంపురం మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో దిగపండి నుంచి బరంపురం నగరంలోకి వస్తున్న కారులో సోదాలు చేశారు. ఈ సందర్భంగా కారులో 3 బస్తాల్లో రవాణా చేస్తున్న 82 కిలోల గంజాయితో పాటు కారుని స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైనవారు పశ్చిమ బెంగాల్‌లోని మిదనపూర్ జిల్లాకు చెందిన హరదన బెహరా మరియు బిశ్వాజిత్ దాస్‌లుగా గుర్తించారు. అరెస్టైనవారి నుంచి రూ.17 వేల నగదు సైతం స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు.

300 లీటర్ల విదేశీ మద్యం స్వాధీనం

- ఇద్దరు వ్యక్తులు అరెస్టు

రాయగడ: పొరుగు రాష్ట్రమైన ఆంధ్రాకు అక్రమంగా విదేశీ మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రాయగడ పోలీసులు అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 300 లీటర్ల వివిధ బ్రాండ్‌ల విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో ముకుల్ సింహ్(41), అఖిల్ సాహు(45)లు ఉన్నట్లు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్డీపీవో రస్మీరంజన్ సేనాపతి, ఐఐసీ కేకేబీకే కుహరో ఆదేశాల మేరకు ఏఎస్ఐ పూర్ణచంద్ర త్రిపాఠి నేతృత్వంలో ఒక బృందం గురువారం సాయంత్రం కుంభికోట ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహించింది. ఈ క్రమంలో ఒక కారు ఆ దిశగా వెళ్తుండడం గమనించి పోలీసులు ఆపి తనిఖీ చేయగా, అందులో భారీగా విదేశీ మద్యం బయట పట్టుబడింది. దీంతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి మద్యం, కారును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో అఖిల్ సాహు అనే వ్యక్తి స్థానిక ఒక విదేశీ మద్యం దుకాణంలో మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తెలింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను శుక్రవారం కోర్టుకు తరలించారు.



విదేశీ మద్యంతో పట్టుబడిన నిందితులు

సెఫాలిలో ఏనుగులు హల్‌చల్



ధ్వంసం చేసిన పంట పొలాలను చూపిస్తున్న సాబొరొ

- పంట పొలాలు ధ్వంసం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి సెఫాలి ప్రాంతంలో ఏనుగులు భీభత్సం సృష్టించాయి. చేతికి అందివచ్చే పంట పొలాలను ఏనుగులు నాశనం చేశాయి. సెఫాలి పరిసర ప్రాంతంలోని రుపాపొదొరొ, సంపుని, గడియాబంగొ, సొరప్రధానిగుడ గ్రామాల్లో రెండు ఏనుగులు భీభత్సం సృష్టిస్తున్నాయని గ్రామస్తులు తెలియజేశారు. గ్రామాల్లోని పచ్చని వరి పంటను నాశనం చేశాయని వాపోయారు. అటవీ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గత కొద్దిరోజులుగా రెండు ఏనుగులు ఈ ప్రాంతంలో ఆహారం వెతకడంతో పాటు నీరు తాగేందుకు వస్తున్నాయని తెలియజేశారు. సుమారు మూడు ఎకరాల వరి పంటను నాశనం చేశాయని బాధితుడు సాబొరొ వాపోయారు. ఏనుగులు సంచరిస్తున్న సమాచారాన్ని తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు ఏనుగుల బారి నుంచి పంట పొలాలను కాపాడటంతో పాటు ఏనుగులను సమీప అడవుల్లోకి తరిమి కొట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

మంచు కురిసే వేళలో..!




మంచులో వాహనాల రాకపోకలు



ఇంజినీరింగ్ కళాశాల రోడ్‌లో కురుస్తున్న మంచు

గంజాం జిల్లాలో రోజురోజుకీ చలి తీవ్రత పెరుగుతోంది. బరంపురం నగరంలో ఉదయం 8 గంటల వరకు విపరీతంగా మంచు కురుస్తోంది. దీంతో వాతావరణం ఆహ్లాదకరంగా కనిపిస్తోంది. అయితే పలుచోట్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రానున్న రోజుల్లో మరింత చలి పెరిగే సూచనలు ఉన్నట్లు వాతవరణ అధ్యయన కేంద్రం తెలియజేసింది. మరోవైపు మంచు తీవ్రంగా కురుస్తుండడంతో పలు రైళ్లు సైతం ఆలస్యంగా నడుస్తున్నాట్లు ఈకో రైల్వే అధికారులు తెలియజేస్తున్నారు.

– బరంపురం



రూశికుల్యా నదిపై కమ్ముకున్న మంచు దుప్పటి

క్లుప్తంగా

ధాన్యలక్ష్మికి పంచామృతాభిషేకం

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లోని శ్రీ క్షేత్రమ్‌లో కొలువై ఉన్న అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వెంకటేశ్వరుని దేవాలయంలో ధాన్యలక్ష్మికి శుక్రవారం స్నపనం, పంచామృతభిషేకం, అర్చన జరిపారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తానా శాంతిసద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం టౌన్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) శాంతి సద్భావన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం గురజాడ స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. శతశతక కర్త చిగురుమళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో 100 దేశాల్లో శాంతి సద్భావన యాత్ర జరగనుందని జిల్లా సమన్వయకర్త చిన్నాదేవి తెలిపారు. ఈ నెల 9న ఆఫ్రికాలోని బోట్సువానాలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం, వంద తెలుగు సంఘాల ఆధ్వర్యంలో యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా తానా వందే విశ్వమాతరం ఆధ్వర్యంలో కవి పండితులు డాక్టర్ జక్కురామకృష్ణ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, గురజాడ ఇందిర, సోమేశ్వరరావు, అన్నపూర్ణ, మంజుల పారుపూడి, దశగ్రంథాల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

విజయనగరం అర్బన్: వచ్చేఏడాది జరగనున్న సాధారణ ఎన్నికలకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్లకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. కలెక్టర్లతో శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. లా అండ్ ఆర్డర్, చెక్‌పోస్టుల ఏర్పాటు, కమ్యూనికేషన్ వ్యవస్థ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక, డీఆర్‌ఓ అనిత, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

సాలూరు: విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. సాలూరు మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ అడ్మిన్‌లతో శుక్రవారం సమావేశమయ్యారు. సచివాలయాల వారీగా సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆస్తి, ఇంటి పన్నుల వసూలుపై దృష్టిసారించాలని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. డంపింగ్‌యార్డును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ జయరాం పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది కాసుల కక్కుర్తిపై విచారణ

విజయనగరం ఫోర్ట్: విజయనగరం సర్వజన ఆస్పత్రి మార్చురీలో పోస్టు మార్టం కోసం, ఆపరేషన్ థియేటర్‌లో రోగులను వార్డుకు తరలించేందుకు సిబ్బంది డబ్బులు అడుగుతున్నారనే అంశంపై 'సాక్షి'లో ఈనెల 2వ తేదీన 'మార్చురీలో కాసుల కక్కుర్తి..!' అనే శీర్షికన ప్రచురించిన కథనానికి ఆస్పత్రి వైద్యాధికారులు స్పందించారు. నలుగురు వైద్యాధికారుల బృందం శుక్రవారం ఆపరేషన్ థియేటర్‌లో పనిచేసే సిబ్బందిని విడివిడిగా విచారణ జరిపారు. మార్చురీ వైద్యులు లేకపోవడంతో ఈ నెల 6వ తేదీన విచారణ చేపడతామని ఆర్‌ఎంఓ డాక్టర్ సురేష్‌బాబు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

పార్వతీపురంటౌన్: పట్టణంలోని కొత్తవలసలో ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం పట్టణ ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తవలసకు చెందిన దుప్పలపూడి సునీల్(21) షార్ట్‌ఫిల్మ్‌లో నటుడిగా, డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. తనకు షార్ట్‌ఫిల్మ్ నిమిత్తం రూ.50వేలు అవసరమని తల్లిని అడిగాడు. ఈ మేరకు తల్లి డబ్బులు ఇవ్వనని చెప్పడంతో మనస్తాపానికి గురై గురువారం అర్ధరాత్రి ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. మృతుడి తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రామభద్రపురం విద్యార్థులు

రామభద్రపురం: ఎస్.కోటలో గత నెల 26వ తేదీన జిల్లా స్థాయిలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రామభద్రపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వ్యాయామ ఉపాధ్యాయులు డి శ్రీదేవి, బి.వెంకటరావు తెలిపారు.జిల్లా స్థాయి పోటీలలో అండర్ 14 విభాగంలో ఎస్.రేవంత్, అండర్ 17 విభాగంలో ఎస్.మేఘనాథ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు ఎంపికైన ఈ విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం కె.కామేశ్వరరావుతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఘోరం..!

- అడవి పందుల కోసం విద్యుత్ తీగలు ఏర్పాటు
- తీగలు తగిలి వ్యక్తి మృతి
- ఎవరికీ తెలియకుండా పాతిపెట్టిన నిందితులు



పోలీసుల అదుపులో నిందితుడు

రాయగడ: అడవి పందులను వేటాడే క్రమంలో విద్యుత్ తీగలను అమర్చడంతో, ఆ విద్యుత్ తీగలకు ఒక యువకుడు బలయ్యాడు. దీంతో విషయం బయటకు తెలుస్తుందని ఇద్దరు వ్యక్తులు మృతుని శవాన్ని పాతిపెట్టి చేతులు దులుపుకుని ఏమీ తెలియనట్లు ఇంటికి తిరిగి వెళ్లిపోయారు. అయితే పోలీసుల దర్యాప్తులో విషయం తెలిసిపోవడంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

వివరాల్లోకి వెళ్తే...

జిల్లాలోని కాసీపూర్ సమితిలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాసీపూర్ సమితి టికిరి పోలీసుస్టేషన్ పరిధి మొహల్‌పుట్ పంచాయతీలోని ఖురిగా గ్రామానికి చెందిన సోను మాఝి కొడుకు విశ్వేశ్వర మాఝి (32) అనే యువకుడు అక్టోబర్ 22వ తేదీ నుంచి కనిపించడం లేదు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. అయితే ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో సోను మాఝి తన కొడుకు విశ్వేశ్వర మాఝి కనిపించడం లేదని అక్టోబర్ 30వ తేదీన టికిరి పోలీసుస్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో చొరాబడి గ్రామానికి చెందిన పదన్ జొడియా, భుబేన్ జొడియా అనే ఇద్దరిని అనుమానించి అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా నిజాలను వెల్లడించారు. తాము అడవి పందులను వేటాడే క్రమంలో విద్యుత్ తీగలను అమర్చామని, ఇది తెలియని విశ్వేశ్వర్ అటుగా వెళ్లి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడని అంగీకరించారు. అయితే నేరం తమపై పడుతుందని భయపడి తాము మృతుని శవాన్ని గోతిలో పాతిపెట్టామని అంగీకరించారు. ఎస్డీపీవో రస్మీరంజన్ సేనాపతి, టికిరి ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్‌లు మేజిస్ట్రేట్ సమక్షంలో నిందితులు పాతిపెట్టిన స్థలానికి శుక్రవారం వెళ్లి పాతిపెట్టిన శవాన్ని బయటకు తీశారు. దీనిపై కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. శనివారం నిందితులను కోర్టుకు తరలించనున్నట్లు వెల్లడించారు.



పాతిపెట్టిన విశ్వేశ్వర మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

మహిళా రిపోర్టర్‌పై నిర్మాత దాడి

భువనేశ్వర్: మీడియా కవరేజీలో హడావుడిగా ఉన్న మహిళా రిపోర్టరును ఓలీవుడ్ నిర్మాత చెంప దెబ్బ కొట్టడం సంచలనం రేపింది. స్థానిక సినిమా థియేటర్‌లో సినీ నిర్మాత సంజయ్ నాయక్ అలియాస్ టుట్టూ తనను చెంప దెబ్బ కొట్టాడని మహిళా జర్నలిస్టు ఆరోపించింది. దీంతో బాధిత జర్నలిస్ట్ దేవస్మిత రౌత్ చలన చిత్ర నిర్మాతకు వ్యతిరేకంగా స్థానిక ఖారవేళ నగర్ ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీటీవీ ఫుటేజీని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. దేవస్మిత రౌత్ ఇతర రిపోర్టర్లతో కలిసి ఒక సినిమా ప్రీమియర్ షో కవర్ చేయడానికి థియేటర్‌కి వెళ్లింది. ఈ కార్యక్రమానికి పలువురు నటీనటులు, సినీ ప్రముఖులు హాజరయ్యారు. దేవస్మిత హాల్ నుంచి బయటకు వచ్చి నటులు మరియు ఇతరుల బైట్‌లను తీసుకునే ప్రయత్నం చేసింది. ఆ సమయంలో టుట్టూ నాయక్ తనను కొట్టి నెట్టాడని ఆరోపించింది. మీడియా బూమ్ మరియు మొబైల్ ఫోన్ ఆమె చేతిలో నుంచి జారిపోయింది. ఈ పరిస్థితిపై నాయక్ ఆమెను చూసి నవ్వుతూ వెళ్లాడని విచారం వ్యక్తం చేసింది. ఆయన ప్రవర్తనపై కవరేజీ కోసం వెళ్లిన దేవస్మిత షాక్ అయింది. అతను తనపై అలా ఎందుకు ప్రవర్తించాడో తెలియలేదని ఆవేదన వ్యక్తం చేసింది. అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసులను అభ్యర్థించింది. వర్కింగ్ జర్నలిస్టును చెంప దెబ్బ కొట్టే హక్కు అతనికి ఎవరు ఇచ్చారని నిలదీసింది. ఇంతలో నాయక్ క్షమాపణలు చెప్పాడు. నాకు ఎలాంటి చెడు ఉద్దేశం లేదు. ఈరోజు జరిగిన దానికి నన్ను క్షమించండని అభ్యర్థించాడు. మరోవైపు పాత్రికేయుల సంఘాలు, వర్గాలు ఓలీవుడ్ నిర్మాత చర్యపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆయన వ్యతిరేకంగా తగిన చర్యలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



చలన చిత్ర నిర్మాతకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయ సంఘాలు

విజేతలకు సత్కారం

భువనేశ్వర్: చైనా హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో అద్భుత ప్రదర్శనతో పతకాలను సాధించిన ప్రమోద్ భగత్ మరియు సౌందర్యకుమార్‌లను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సత్కరించి నగదు బహుమతులను ప్రదానం చేశారు. ప్రమోద్ భగత్‌కు రూ.2 కోట్లు, సౌందర్య కుమార్‌కు రూ.1.5 కోట్ల చెక్ అందజేశారు. షట్లర్ ప్రమోద్ భగత్ పురుషుల సింగిల్స్‌లో స్వర్ణం, పురుషుల డబుల్స్ మరియు మిక్స్‌డ్ డబుల్స్‌లో ఒక్కో కాంస్యం సాధించాడు. చదరంగంలో సౌందర్య కుమార్ స్వర్ణం మరియు వ్యక్తిగత ఈవెంట్‌లో రజతం సాధించడం విశేషం. ఆసియా పారా గేమ్స్‌లో అత్యుత్తమ విజయాలు సాధించిన అథ్లెట్లు ప్రమోద్ భగత్ మరియు సౌందర్యకుమార్‌లను సత్కరించడం గర్వంగా ఉందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. వారి అంకితభావం, ప్రతిభ, పట్టుదల రాష్ట్రానికి ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాయని పేర్కొన్నారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు సన్నద్ధతతో ముందుకు సాగే ప్రయాణంలో ప్రమోద్ భగత్ మరియు సౌందర్య కుమార్ ఇరువురు పారా అథ్లెట్లకు తిరుగులేని మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం భగత్ మరియు సౌందర్య ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి సత్కారం అందుకుంటున్న సౌందర్య కుమార్, ప్రమోద్ భగత్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జయపురం: కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం రాత్రి రాజేష్ ఖిలో బైక్‌పై తమ స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో చంద్రపడ గ్రామ కూడలిలో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. రాజేష్ ఖిలో దశమంతపూర్ నుంచి బొయిపరిగుడ సమితి మైనాపడ గ్రామానికి సొంత పనిపై వెళ్లాడు. జయపురం సమితి పాత్రోపుట్ గ్రామం నుంచి రాజేష్ బంధువు ఒకరు కూడా మైనాపడ వచ్చాడు. మైనాపడలో పని ముగించుకొన్న రాజేష్ తన బంధువుని పాత్రోపుట్‌లో బైక్‌పై తీసుకెళ్లి దింపాడు. అనంతరం అక్కడ నుంచి దశమంతపూర్ బయల్దేరుతుండగా మల్కన్‌గిరి నుంచి వస్తున్న ఒక కారు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజేష్ దూరంగా ఎగిరిపడ్డాడు. స్థానికులు వెంటనే అంబులెన్స్‌ను రప్పించి అతడిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్చారు. ప్రమాద సమాచారం అందిన బొయిపరిగుడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన కారు, బైక్‌లను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. రాజేష్ పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని కొరాపుట్ సహిద్ లక్ష్మణ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్ ఖిలో

ఉపాధ్యాయురాలి మెడలో గొలుసు చోరీ

జామి: మండలంలోని లొట్లపల్లి జెడ్పీఉన్నతపాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా చేస్తున్న కె.అరుణకుమారి మెడలోని బంగారం గొలుసు చోరీకి గురైంది. ఆమె ఎప్పటిలాగానే శుక్రవారం విజయనగరం నుంచి స్కూటీపై పాఠశాలకు వస్తున్న సమయంలో లొట్లపల్లి సిమెంట్ ఫ్యాక్టరీ జంక్షన్ వద్ద విజయనగరం నుంచి కొత్తవలస వెళ్లే ప్రధానరహదారిపై ఆమె వెనుకనుంచి మాస్కులు ధరించిన ఇద్దరు యువకులు పల్సర్ బైక్‌పై వచ్చి మెడలో ఉన్న 2తులాల బంగారం చైన్‌ను తెంపివేసి భీమసింగి వైపు పరారయ్యారు. ఈ ఘటన నుంచి ఉపాధ్యాయురాలు తేరుకుని పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై వీరబాబు ఘటనా స్థలానికి వచ్చి జరిగిన ఘటనపై ఆరాతీశారు. బ్లాక్ కలర్ పల్సర్ బైక్‌పై ఇద్దరు దుండగులు వచ్చారని ఉపాధ్యాయురాలు ఎస్సైకి తెలియజేశారు. ఈ మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై తెలిపారు.

ఒక్క ఫోన్ కొడితే వచ్చి తాట తీస్తాం

- దిశ డీఎస్పీ హర్షిత
- జిల్లా వ్యాప్తంగా యాప్ స్పెషల్ డ్రైవ్

పార్వతీపురంటౌన్: మహిళలను ఆకతాయిల నుంచి రక్షించేందుకు దిశ యాప్ ఉపయోగపడుతుందని, ఒక ఎస్ఓఎస్ ఫోన్ కొడితే చాలునని, వచ్చి ఆకతాయిల తాటతీస్తామని దిశ డీఎస్పీ హర్షిత స్పష్టం చేశారు. ఈ మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శుక్రవారం పార్వతీపురం జిల్లావ్యాప్తంగా దిశయాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహణలో భాగంగా పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, పార్కులు, సినిమా థియేటర్ల వద్ద మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులపై లైంగిక వేధింపులు, దాడులు జరగకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో దిశయాప్ ఉండాలని, ఆపద సమయాల్లో దాన్ని ఉపయోగించి పోలీసుల సహకారం పొందాలని కోరారు. ఈ యాప్ మహిళలకు వజ్రాయుధం లాంటిదని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.మురళీధర్, పట్టణ సీఐ కృష్ణారావు, ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.



నర్సిపురం ఎస్‌వీసీ థియేటర్లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించిన డీఎస్పీ హర్షిత

గిరిజన వర్సిటీని సందర్శించిన చాన్సలర్

విజయనగరం అర్బన్: విజయనగరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల నియమించిన చాన్సలర్ మదన్‌లాల్ మీనా (విశ్రాంతి ఐఏఎస్) శుక్రవారం సందర్శించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కట్టిమణి ఆయనకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి స్వాగతం పలికారు. తొలుత వర్సిటీ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం వివిధ విభాగాలు, ప్రయోగశాలలను సందర్శించారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసన్ విశ్వవిద్యాలయ వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చాన్సలర్‌కు వివరించారు. బోధన సిబ్బందితో మీనా మాట్లాడారు. బోధన, పరిశోధన, పరిపాలనా పరమైన వివిధ అంశాలపై పలుసూచనలు చేశారు. వర్సిటీలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ డీన్ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, ప్రొఫెసర్ జితేంద్రమోహన్‌మిశ్ర, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కివాడే, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చాన్సలర్ మదన్‌లాల్ మీనా

9న వైటీసీలో జాబ్‌మేళా

సీతంపేట: స్థానిక వైటీసీలో ఈ నెల 9న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు శ్రీసిటీలో క్యాడ్‌బరీ చాక్లెట్ తయారు చేసే ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ మొండేలేజ్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరగనున్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఆపైన చదివిన వారు ఇంటర్వ్యూలకు అర్హులని స్పష్టం చేశారు. ఎంపికైన వారికి నెలకు రూ.17,500లు వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9150015264 నంబర్‌లో సంప్రదించి దరఖాస్తు చేయాలని సూచించారు.

విద్యాప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు

- వంగర కేజీబీవీని తనిఖీ చేసిన డీఈఓ
- ఎస్ఓ పనితీరు అధ్వానంగా ఉందంటూ మహిళల ఫిర్యాదు

వంగర: పాఠశాలల్లో విద్యార్థుల విద్యాప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. పాఠ్యప్రణాళికను పక్కాగా అనుసరించాలన్నారు. వంగర కేజీబీవీని శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు, విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. కేజీబీవీలో తరగతిగదులు, సౌకర్యాలు, సమస్యలను ఎస్ఓను అడిగితెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరతను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. విద్యార్థుల్లో కనీస విద్యాసామర్థ్యాలను తెలుసుకునేందుకు జిల్లా వ్యాప్తంగా స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ (ఎస్ఈఏఎస్)-2023 ప్రత్యేక పరీక్ష నిర్వహించిందన్నారు. అంతకు ముందు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పలువురు మహిళా సంఘాల ప్రతినిధులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బి.రోహిణి పనితీరు సక్రమంగా లేదని, విద్యార్థులకు అందిస్తున్న భోజనాల్లో నాణ్యత పాటించడం లేదని, కేజీబీవీకి వచ్చిన వారితో దురుసుగా ప్రవర్తిస్తున్నారంటూ డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విధులు నిర్వహణలో బాధ్యతలోపిస్తే సిబ్బందిపై కఠిన చర్యలుంటాయని ఎస్ఓను హెచ్చరించారు. వారంరోజుల్లో రెండు రోజులు కేజీబీవీని సందర్శించాలని ఎంఈఓ వై.దుర్గారావును ఆదేశించారు. అనంతరం అరసాడలో నాడు-నేడు పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీఓ వంగపండు గోపీచంద్, ఎస్ఓ బి.రోహిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కేజీబీవీలో విద్యార్థులు భోజనాలు పరిశీలిస్తున్న డీఈవో బి.లింగేశ్వరరెడ్డి

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం

దత్తిరాజేరు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కబేళాలకు తరలిస్తున్న 16 పశువులను, రెండు వ్యాన్లను స్వాధీనం చేసుకున్నట్లు పెదమానాపురం ఎస్సై శిరీష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మాట్లాడుతూ పార్వతీపురం నుంచి అలమండకు అనుమతులు లేకుండా పరిమితికి మించి పశువులను తరలిస్తున్నారన్న మందస్తు సమాచారం మేరకు పెదమానాపురం వద్ద సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టి పశువులు తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నామన్నారు. ఈ మేరకు పశువుల యజమానులు, వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



పోలీసుల తనిఖీలో పట్టుబడిన పశువులు

డ్వాక్రా ఉత్పత్తులకు

అపూర్వ ఆదరణ

- ఆకర్షిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్
- ప్రదర్శన, విక్రయాలకు 18 రాష్ట్రాలకు చెందిన 251 స్టాల్స్
- హస్తకళలు, వస్త్రాలు, అలంకార వస్తు ప్రదర్శన
- ఆరురోజుల్లో రూ.2.80 కోట్ల వ్యాపారం

విజయనగరం అర్బన్:

విజయనగరం ట్యాంకు బండ్ రోడ్డును ఆనుకుని మాన్సాస్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన అఖిల భారత డ్వాక్రా బజార్‌కు కొనుగోలుదారుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాలు, రాష్ట్రంలోని 26 జిల్లాలకు చెందిన గ్రామీణ, పట్టణ స్వయం సహాయక సంఘాల మహిళల తయారు చేసిన నాణ్యమైన ఉత్పత్తులను 251 స్టాల్స్‌లో ప్రదర్శనకు ఉంచారు. గృహాలంకరణ వస్తువులు, కలంకారీ, కాటన్ చీరలు, చేనేత, ఖాదీ వస్త్రాలు, చెక్కబొమ్మలు, అలంకార వస్తువులు చూపరులను ఆకర్షిస్తున్నాయి. జూట్‌తో తయారు చేసిన జూట్ బ్యాగ్‌లు, నోరూరించే వివిధ ప్రాంతాల సంప్రదాయ తినుబండారాలు, జెనరిక్ ఔషధాలు, సుగంధాలు తదితర సకల ఉత్పత్తులు అఖిల భారత డ్వాక్రా బజార్‌లో లభిస్తున్నాయి. ఆరు రోజుల్లో రూ.2.80 కోట్ల లావాదేవీలు జరిగాయి. ఈ నెల 8 వరకు ఉత్పత్తుల విక్రయం కొనసాగుతుంది. మరోవైపు మైదానంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు చిన్నారులను అలరిస్తున్నాయి.

ప్రదర్శన వస్తువులు ఇవే

ఎగ్జిబిషన్‌లో వెదురు ఉత్పత్తులు, వస్త్ర ఉత్పత్తులు, చీరలు, జ్యూవెలరీ, హ్యాండ్‌లూమ్, డ్రై ఫ్లవర్స్, హ్యాండీ క్రాఫ్ట్, బెడ్‌షీట్స్, గృహాలంకరణ వస్తువులు, కుర్తాలు, రెడీమేడ్ దుస్తులు, ఆభరణాలు, మసాలా దినుసులు, కార్పెట్లు, డ్రైఫ్రూట్స్, ఆర్టిఫీషియల్ జ్యూవెలరీ, జ్యూట్ డోర్ ఉత్పత్తులు, పోచంపల్లి, గద్వాల్ వస్త్రాలు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయి.



జూట్‌తో తయారు చేసిన ఆకర్షణీయమైన గృహాలంకరణ



హ్యాండీ క్రాఫ్ట్ ఉత్పత్తుల విక్రయశాల

అరుదైన ఉత్పత్తులు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణ చక్రవర్తి

విజయనగరం అర్బన్: పట్టణంలోని నిర్వహిస్తున్న అఖిల భారత డ్వాక్రా బజార్‌లో రాష్ట్రేతర అరుదైన ఉత్పత్తులు ప్రదర్శనలో ఉన్నాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ ఎ.కళ్యాణచక్రవర్తి తెలిపారు. ప్రదర్శన ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల 28 నుంచి నిర్వహిస్తున్న వస్తు ప్రదర్శనలో 18 రాష్ట్రాలకు చెందిన పలువురు పొదుపు మహిళల ఉత్పత్తులతో కూడిన స్టాల్స్ ఉన్నాయన్నారు. నాణ్యమైన, అరుదైన వస్తువులు కొనుగోలు చేసుకునేవారు డ్వాక్రా బజర్‌ను సందర్శించాలన్నారు. గ్రామీణ మహిళల హస్తకళా ఉత్పత్తుల విక్రయాన్ని ప్రోత్సహించడం, వాటికి ప్రాచుర్యం కల్పించడమే ముఖ్య ఉద్దేశంగా కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పదర్శన నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. సమావేశంలో సమాచార శాఖ ఏడీ డి.రమేష్, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



వంట సామగ్రి

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్



ఆదిత్యుని జ్ఞాపికను సీవీఓ ప్రసన్నకుమార్‌కు అందజేస్తున్న ఈఓ, ప్రధానార్చకులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీఓ) ఏవీఎల్ ప్రసన్నకుమార్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. గోత్రనామాలతో పూజలు చేయించారు. అనివేటి మండపంలో వేదాశీర్వచనం, ఆదిత్యుని జ్ఞాపికను ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐలు వెంకునాయుడు, వెంకటనారాయణ, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో ఫైళ్ల పరిశీలన

స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో విజిలెన్స్ విభాగంలో పలు ఫైళ్లను విజిలెన్స్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ ప్రసన్నకుమార్ శుక్రవారం ఉదయం పరిశీలించారు. అక్రమ విద్యుత్ కేసుల విషయంలో లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.

ఉత్తరాంధ్ర చిత్రకళా ప్రదర్శనకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్: కల్పన కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర జిల్లా చిత్రకళ ప్రదర్శనకు చిత్రకారుల నుంచి చిత్రాలను ఆహ్వానిస్తున్నామని నిర్వాహకులు యార్లగడ్డ హేమంత్ కుమార్ ఓ ప్రకటనలో కోరారు. చిత్రాల కనిష్ట సైజు 18-26 అంగుళాలు, గరిష్ట సైజు 24-36 అంగుళాలు ఉండాలని అన్నారు. ఆయిల్, అక్రిలిక్, వాటర్ కలర్స్ చిత్రాలు మాత్రమే అనుమతిస్తామని, ఉత్తమ చిత్రాలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు నగదు, షీల్డ్, సర్టిఫికెట్ అందిస్తామని పేర్కొన్నారు. డిసెంబరు 9, 10 తేదీల్లో పార్వతీపురంలోని లయన్స్ కల్యాణ మండపంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 8179940599 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొననున్న అండర్-19 క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎన్.రామన్న తెలిపారు. గురుకులంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. సైక్లింగ్ పోటీలు ఈ నెల 5న దుప్పలవలస గురుకులంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 5న సాఫ్ట్ టెన్నిస్ పోటీలు పాతపట్నం మినీ స్టేడియంలో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నంబర్ 6302546128ను సంప్రదించాలని చెప్పారు.

పలు కేసుల్లో ఆరుగురు అరెస్టు

టెక్కలి రూరల్: మండలంలో పలు కేసులకు సంబంధించి పోలీసులు ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ ఏడాది జూలై నెలలో నమోదైన గంజాయి కేసుకు సంబంధించి మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. జూన్ నెలలో అక్రమంగా తరలిస్తున్న 20 కిలోల గంజాయితో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులో తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసుకే సంబంధించి టెక్కలికి చెందిన దాసరి మౌళి, రఘు బెహరా అనే మరో ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అదుపులో తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కొట్లాట కేసులో ముగ్గురు అరెస్టు

మండలంలోని దీపావళి, పెద్దరోకళ్ల పల్లి గ్రామంలో ఇరువర్గాల మధ్య కొట్లాటకు సంబంధించి ఆగస్టు నెల లో మెండబోయిన దమయంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తామరపల్లి రమణయ్య, కిషోర్, కళావతి అనే ముగ్గురిని అరెస్టు చేసినట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. అలాగే జూన్ నెలలో మండలంలోని పెద్దసాన గ్రామంలో గల దేవాలయం వద్ద పడుకుని ఉన్న వ్యక్తిపై జరిగిన దాడి కేసులో బడగల మనోజ్ అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'స్వచ్ఛందంగా సేవ చేయండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: పారాలీగల్ వలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. పారా లీగల్ వలంటీర్ల శిక్షణ కార్యక్రమానికి అభ్యర్థుల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారా వలంటీర్లు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని కోర్టు గౌరవ ప్రతిష్టలు కాపాడేలా ప్రవర్తించాలన్నారు.

'పరీక్ష ఫీజులు చెల్లించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అన్ని జూనియర్ కళాశాలల్లో పరీక్ష ఫీజులను వంద శాతం మంది చెల్లించేలా చూడాలని ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు తెలిపారు. శ్రీకాకుళంలోని శ్రీ కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో జిల్లా ఆర్‌ఐఓ పి.దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాచ్‌లవారీగా ప్రాక్టికల్స్ నిర్వహించాలని ప్రిన్సిపాళ్లకు సూచించారు.

ఆయుర్వేద వైద్యానికి ఆయుష్షు



ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఆయుర్వేద మందులు

- ఆయుర్వేదానికి ప్రభుత్వం ప్రాధాన్యత
- జిల్లాలో 14 ఆయుర్వేద డిస్పెన్సరీలు
- శ్రీకాకుళంలో ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రం



పరీక్షల అనంతరం యోగా చేయిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: భారతీయ సనాతన వైద్య రీతి ఆయుర్వేదానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇంగ్లిష్ మందులకు చాలా మంది అలవాటు పడిపోయినా.. ఆయుర్వేద మందులతో కూడా పలు రకాల అనారోగ్యాలను బాగు చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో 14 ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉన్నాయి. గతంలో ఈ డిస్పెన్సరీలకు ప్రాధాన్యత లేకుండా నిర్వహించేవారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఆయుర్వేద వైద్యానికి ప్రాధాన్యత ఇవ్వడం మొదలుపెట్టారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నూతనంగా మందులను సరఫరా చేస్తోంది.

ఉచిత సేవలు

జిల్లా వ్యాప్తంగా 14 చోట్ల ఆయుర్వేద డిస్పెన్సరీలు ఉన్నాయి. ప్రైవేటుగా కూడా జిల్లా కేంద్రంలో చాలా ఆయుర్వేద కేంద్రాలు ఉన్నాయి. తాజాగా జిల్లా కేంద్రంలో ఉన్న డిస్పెన్సరీని అప్‌గ్రేడ్ చేసి ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రంగా చేశారు. ఇక్కడ యోగా కూడా నిర్వహిస్తున్నారు. ఆయుర్వేద మందుల కోసం వచ్చే వారికి చికిత్సతో పాటుగా యోగా చేయిస్తున్నారు.

రూ.11లక్షల మందులు సరఫరా

ప్రతి మూడు నెలలకు జిల్లాలోని ఆయుర్వేద డిస్పెన్సరీలకు సుమారుగా రూ.11లక్షల విలువైన మందులు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఏడాదికి రూ.50లక్షల విలువ గల మందులు అందజేస్తున్నారు. అవసరమైన చోట డిస్పెన్సరీల రిపేర్లు కూడా చేయిస్తున్నారు.

సైడ్ ఎఫెక్టులు ఉండవు

ఆయుర్వేద వైద్యంతో సులభంగా, శాశ్వతంగా అనేక విధాలైన దీర్ఘకాలిక వ్యాధులను, మానసిక వ్యాధులను నివారించవచ్చు. వైద్యంలో ఎలాంటి సైడ్ ఎఫెక్టులు గానీ, మందులు వికటించడం గానీ ఉండదు. శస్త్ర చికిత్స అవసరం లేకుండా శారీరక, మానసిక రుగ్మతలను, రోగాలను ఈ వైద్యం ద్వారా రూపుమాపవచ్చని ఎంతో మంది వైద్యులు నిరూపించారు. దీనికి తోడు ఆయుర్వేద మందులు వాడితే రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

ఆయుర్వేదంతో ఎన్నో రోగాలు మాయం



ఇంగ్లిష్ మందుల వల్ల నయం కాని రోగాలు ఆయుర్వేదంతో నయమవుతాయి. ముఖ్యంగా చర్మవ్యాధులు, కీళ్లవ్యాధులు కేవలం ఆయుర్వేదం ద్వారానే నయం అవుతాయి. ఇక్కడ పిస్టులా వ్యాధికి క్షారసూత్ర (త్రెడ్డింగ్) ద్వారా వైద్యం అందిస్తున్నాం. మందుల వాడకం ఇటీవల కాలంలో బాగా పెరుగుతోంది. రోజుకు 30మందికి పైగా వస్తున్నారు. ఆయుష్ సహకారంతో ఉచితంగా మందులను పరీక్షలు జరిపి ఇస్తున్నాం. వెంటనే యోగా కూడా చేయిస్తున్నాం. మందుల వాడకంపై ఎంతోమంది అపోహ పడుతున్నారు. దీనికి ఎలాంటి పథ్యం పాటించక్కరలేదు. కేవలం వ్యాధికి సంబంధించిన పథ్యం మాత్రమే.

– డాక్టర్ పి. జగదీష్, ఆయుష్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సీనియర్ వైద్యులు

సయాటికా సమస్య తీరింది



నేను రిటైర్ అయిన తర్వాత నాకు సయాటికా సమస్య వచ్చింది. సాధారణ మందుల వల్ల నయం కాలేదు. రెండు నెలలుగా క్రమం తప్పకుండా ఆయుర్వేద మందులు వాడుతున్నాను. బాగా గుణం కనిపించింది.

– బి.శ్రీరామమూర్తి, బలివాడ

సాధారణ సమస్యలు తగ్గాయి



జలుబు, జ్వరం వంటి సాధారణ రోగాల కోసం కూడా ఈ మందులు వాడుతున్నాను. బాగా తగ్గాయి. ఈ మందులు వాడుతున్న దగ్గర నుంచి హాయిగా ఉంది.

– భారతి, పొన్నాడ

పెద్దవారిలో కీళ్లనొప్పులు, గుండెజబ్బులు, ఊపిరితిత్తుల వ్యాధులు వంటివే కాకుండా మహిళల్లో వచ్చే వ్యాధులకు ఆయుర్వేదంతో పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు.

'సైనికుల త్యాగాలు మరువలేనివి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: దేశ రక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని,వారి సేవలు దేశ ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలం మాకివలసకు చెందిన చల్ల రమేష్ ఆర్మీలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసి స్వగ్రామానికి శుక్రవారం వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రమేష్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు చింతు రామారావు, మాకివలస ఎంపీటీసీ యాళ్ల అప్పలనాయుడు, సర్పంచ్ రావాడ మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, బుద్దల రాజశేఖరరావు, పాగోటి భరద్వాజ, చల్ల తాతారావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో అవగాహన



గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖాధికారులు

మందస: పెద్దపులి ఆనవాళ్ల కోసం అటవీ శాఖ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మందస-సోంపేట మండలాల సరిహద్దుల్లో పులి తిరుగుతున్నట్టు పాదముద్రలు కనిపించడంతో మందస మండలంలోని కొత్తపల్లి, ముకుందపురం, మూలిపాడు ప్రాంతాల్లో ప్రవహిస్తున్న మహేంద్ర తనయ నదిలో అధికారులు పులి పాదముద్రలను శుక్రవారం గుర్తించారు. కాశీబుగ్గ రేంజ్ అధికారి ఎ.మురళీకృష్ణనాయుడు ఆధ్వర్యంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు, ఫారెస్ట్‌బీట్ అధికారులు, అసిస్టెంట్ బీట్ అధికారులు ఆర్.రాఘవయ్య, వజ్రపుకొత్తూరు బీవీరెడ్డి, పి.రాజు, ఎస్.రాజేంద్ర ఎఫ్ఎస్‌బీ ఎం.పోలయ్య, టి.వెంకటేశ్, ఎస్.దుర్గాదేవి, ఆర్.వెన్నెల, ఆర్.జోగారావు, ఎ.బాబురావు, ఎస్.రవి, ఆర్.సంతోష్‌కుమార్, కృష్ణారావు రెండు బృందాలుగా విడిపోయి పెద్దపులిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలోని మూలిపాడు, ముకుందపురం, కొత్తపల్లి, సిద్ధిగాంలతో పాటు పాత్రఖండ, కర్తలిపాలేం, పాలవలస తదితర గ్రామాల్లో పర్యటించి, ప్రజలకు అవగాహన కల్పించారు. పెద్దపులి సంచారంపై పుకార్లను ప్రచారం చేయవద్దని కోరారు.

'ఐటీఐ విద్యార్థుల్లో లైఫ్‌స్కిల్స్ కీలకం'



శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులతో అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ఐటీఐ విద్యార్థుల్లో లైఫ్ స్కిల్స్ అవసరమని ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సుధాకర్ అన్నారు. ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ లోని స్కిల్ హబ్‌లో లైఫ్‌స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఐటీఐ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వం ఐటీఐ పూర్తి చేసిన విద్యా ర్థులకు వంద శాతం ఉపాధి, ఉద్యోగ కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందుకోసమే స్కిల్ హబ్‌లు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులకు ఉద్యోగాలు లభించాలంటే కమ్యూనికేషన్ స్కిల్, ఇంగ్లిష్ పరిజ్ఞానం, సాఫ్ట్‌స్కిల్స్, లైఫ్ స్కిల్స్ అవసరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారులు కామేశ్వరరావు, విద్యాసాగర్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు సైకత నివాళులు



విజయనగరం జిల్లా అలమండ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన ప్రయాణికులకు గేదెల హరికృష్ణ సైకత నివాళులు అర్పించారు. గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద రైలు ప్రమాద మృతులకు కన్నీటి నివాళులు అర్పిస్తూ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు.

– ఆమదాలవలస రూరల్

6న అంతర వర్సిటీ కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 6న అంతర వర్సిటీ పోటీల్లో పాల్గొనే కబడ్డీ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు చెప్పా రు. వర్సిటీలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం తొమ్మిది గంటల నుంచి ఎంపికలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. డిగ్రీ, పీజీ విద్యార్థులు ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు.

గఘున విన్యాసం



నింగి కొత్త రంగులద్దుకుంది. నిశి వేళ గగన వేదికపైకి దూసుకువచ్చిన మబ్బులు ఓ అద్భుత దృశ్యాన్ని ఆవిష్కరించాయి. సూర్యోదయ సమయానికి తెరిమంచు తెరల మధ్య వెండి మేఘాలు మెరిసిపోయి కనిపించాయి. ప్రకృతి విన్యాసాన్ని శ్రీకాకుళం నగర వాసులు ఆస్వాదించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం క్రైమ్

ఆటో డ్రైవర్ గొంతు కోసి పరారీ



ఆటో డ్రైవర్ గొంతుకోసి పరారయిన అనుమానితుని సీసీ టీవీ పుటేజీ



ఆటో డ్రైవర్ గోవిందరావు నుంచి ఘటన వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్‌ఐ

నందిగాం: మండలంలోని దిమ్మడిజోల కల్లాడ మధ్య రహదారిపై గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని ప్రయాణికుడు ఆటో డ్రైవర్ గొంతు కోసి పరారయ్యా డు. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస శ్రీనివాసనగర్‌కు చెందిన గేదెల గోవిందరావు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. పలాస రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణికులను ఎక్కించుకుని గమ్యస్థానాలకు చేరుస్తుంటారు. రోజులాగే గురువారం రాత్రి 10.30 గంటలకు విశాఖ నుంచి పలాస వచ్చే ప్యాసింజర్ రైలు నుంచి వచ్చే వారి కోసం వేచి ఉన్నాడు. ఆ ట్రైన్‌లో దిగిన ఓ వ్యక్తి గోవిందరావు వద్దకు వచ్చి నందిగాం మండలం కాపుతెంబూరు తీసుకువెళ్లాలని, చార్జీ రూ.500కు మా ట్లాడుకున్నారు. అయితే పలాస నుంచి బెండిగేటు వద్దకు ఆటో వచ్చే సరికి కాపుతెంబూరు కాదు దిమ్మడిజోల తీసుకువెళ్లాలని గోవిందరావుకు చెప్పాడు. అయి తే దిమ్మడిజోల దూరం కాబట్టి రూ.500కు రాలేను అంటే అదనంగా డబ్బులు ఇస్తానని చెప్పడంతో మెళియా పుట్టి మార్గంలో దిమ్మడిజోల గ్రామ చివరకు చేరారు. అక్కడకు వెళ్లాక కల్లాడ మీదుగా నేరేడుకోట వెళ్లాలని చెప్పడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆ ఊరిలో మా అక్క ఉంది డబ్బులు ఇస్తానని చెప్పడంతో కల్లాడ వైపు వెళ్తుండగా మార్గం మధ్యలో ప్రయాణికుడు తన వద్ద కత్తితో ఆటోడ్రైవర్ గొంతు కోసి పరారయ్యా డు. ఆ దారిలో పొలాలకు నీరు పెట్టేందుకు వచ్చిన కొందరు రైతులు ఆపి రాత్రి ఎక్కడకు వెళ్తున్నావని ప్రశ్నిస్తే.. ఆటో డ్రైవర్ మధ్యలో దింపేశాడని చెప్పి పరారయ్యా డు. ఇంతలోగా ఆటో డ్రైవర్ కేకలు వేయడంతో రైతులు అతని పరిస్థితి చూసి సపర్యలు చేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం రాగోలు జెమ్స్‌కు తరలించారు. గాయపడిన ఆటో డ్రైవర్ గోవిందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్‌ఐ మహమ్మద్‌అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నందిగాం మండలంలో ఈ ఘటన ఒక్కసారిగా సంచలనం రేపింది. దీంతో నందిగాం పోలీసులు రైల్వే స్టేషన్ సీసీ టీవీ పుటేజీలో అనుమానితుని గుర్తించి కల్లాడ పరిసర గ్రామాల్లో వెతుకుతున్నారు.

రాష్ట్రస్థాయి నాటిక పోటీలు ప్రారంభం



విద్యార్థులకు సర్టిఫికెట్ల బహూకరణ



మేము మనుషులమే నాటికలో దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: యువత నాటక రంగానికి రావాలని, అప్పుడే నాటక రంగం కొనసాగుతుందని పలువురు వక్తలు అన్నారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నాటిక పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా ఐఅండ్‌పీఆర్ ఆఫీసర్ కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ సమాఖ్య ఎన్నో కష్టనష్టాలతో విజయవంతంగా ఈ సంస్థను నడిపిస్తున్న వారందరికీ అభినందనలు తెలిపారు. విశ్రాంత ప్రొఫెసర్ డీఎస్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగే నాటిక పోటీల్లో సమాఖ్య కూడా పాల్గొనాలని కోరారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం ఆన్‌లైన్‌లో నిర్వహించిన వేమన పద్యాలు, చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన ప్రణీత్, ప్రేమ్‌కుమార్‌లకు నగదు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందించారు.

ఈ సందర్భంగా రావి నాగేశ్వరరావు రచన, సంధ్యా ప్రియదర్శిని దర్శకత్వంలో జాస్మిన్ ఆర్ట్స్, విశాఖ వారి 'మేము మనుషులమే' నాటిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. హిజ్రాల జీవితాల కథాంశంగా నాటిక నడిచింది. ఈ నాటికను డాక్టర్ సూర్యలింగం, లక్ష్మీనరసమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సౌజన్యంతో ప్రదర్శించారు. ది అమెచ్యూర్స్ డ్రమెటిక్ అసోసియేషన్, చిలకలూరి పేట వారి 'ఏడనున్నాడో-ఎక్కడున్నాడో' నాటిక హాస్యభరితంగా సాగింది. ఎస్‌కె షఫీ దర్శకత్వం వహించారు. ఈ నాటికను పూర్ణా క్రియేషన్స్ ఫాజుల్ భాగ్ పేటకు చెందిన పన్నాల నర్సింహమూర్తి సోదరుల సౌజన్యంతో ప్రదర్శించారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నాం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో 2024 సాధారణ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ముఖ్య అధికారి ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం ఉదయం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ జీఆర్ రాధికతో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 2357 పోలింగ్ స్టేషన్లను గుర్తించామని, సాయుధ భద్రత దళాలు మినహా 11,313 మంది పోలింగ్ ఆఫీసర్లతో కలిపి 17,542 మంది సిబ్బంది, పోలీసు వాహనాల మినహా 600 వరకూ వివిధ రకాల వాహనాలు అవసరమని గుర్తించామ ని పేర్కొన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది కోసం 9 శిక్షణ కేంద్రాలు, ఎన్నికల సామ గ్రి పంపిణీ కోసం 8 డిస్పాచ్ కేంద్రాలు, తిరిగి వాటిని స్వీకరించేందుకు 8 కేంద్రాలు, 16 స్ట్రాంగ్ రూమ్‌లు, 17 కౌంటింగ్ సెంటర్లను ఇప్పటికే గుర్తించామని వివరించారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసు భద్రత కోసం 1300 మందిని నియమించనున్నట్లు ఎస్పీ రాధిక పేర్కొన్నారు. మొబైల్ సిగ్నల్స్ లేని 13 (పాతపట్నం 12, పలాస 1) పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, రానున్న రెండు మూడు నెలల్లో అక్కడ కొత్తగా సెల్ ఫోన్ టవర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న 15 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వివరించారు. వచ్చే డిసెంబర్ నెలాఖరుకు పోలింగ్ సిబ్బందికి శిక్షణలు పూర్తి చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నా రు. ఎస్పీ రాధిక మాట్లాడుతూ 2019లో ఎన్నికల సందర్భంగా 672 ఎఫ్‌ఐఆర్ లు నమోదు చేశామని పేర్కొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వర కూ రూ.53 లక్షలు విలువైన మద్యం సీజ్ చేశామని, 437 కిలోల గంజాయిని పట్టుకుని కేసులు నమోదు చేశామని వివరించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ఇప్పటినుంచే పటిష్టమైన, కట్టుదిట్టమైన నిఘాను పెట్టనున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, అదనపు ఎస్పీ తిప్పేస్వామి పాల్గొన్నారు.

పలాసలో ఏసీబీ అధికారుల తనిఖీలు



టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో కంప్యూటర్‌లో వివరాలు సేకరిస్తున్న ఏసిబి సిఐలు

- పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కార్యాలయంలో తనిఖీలు
- మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, సచివాలయ టౌన్‌ప్లానింగ్‌పై ఆరా

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం ఏసీబీ అధికారులు స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం సిబ్బందిని వణికించారు. ఉదయం పదకొండు గంటలకు ఆల్ ఇండియా పర్మిట్‌తో ఉన్న రెండు కార్లు మున్సిపల్ కార్యాలయానికి వచ్చాయి. అందులో నుంచి దిగిన అధికారులు ఒక్కసారిగా టౌన్‌ప్లానింగ్ విభాగంలోకి ప్రవేశించి అందరి సెల్‌ఫోన్లు తీసుకుని ఎక్కడి వారు అక్కడే కూర్చోవాలని ఆదేశించారు. దీంతో కంప్యూటర్లు, టేబుల్ వద్ద ఉన్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది ఒక్కసారిగా అవాక్కయ్యారు. మున్సిపాలిటీలోని వార్డు ప్లానింగ్ కార్యదర్శులను పిలిపించారు. స్థానికంగా ఉన్న కొన్ని భవనాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. ముగ్గురు సీఐలు మూడు బృందాలుగా విడిపోయి భవనాల పరిశీలనకు ఓ బృందం, ఆ భవనాల రికార్డులు మరికొందరు సేకరించారు. ఏసీబీ డీఎస్పీ రాకపోవడంతో వివరాలు వెల్లడించడానికి అధికారులు విముఖత చూపించారు. సీఐలు ఏవీ రమణ, భాస్కరరావు, హరి తదితరులు తనిఖీలు నిర్వహించారు.